ఏమీ కొనలేం.. తినలేం..!

- కూరగాయల ధరలకు రెక్కలు
- కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి ధర
- లబోదిబోమంటున్న సామాన్యులు, చిరుద్యోగులు

వరలక్ష్మి ఓ సాధారణ గృహిణి. ముగ్గురు సంతానం. భర్త చిరుద్యోగి. ఆమె మార్కెట్‌కు వెళ్లి ఐదు రకాల కూరగాయలు, ఉల్లిపాయలు, టమాటాలు తీసుకున్నారు. బిల్లు చూస్తే రూ.500 అయింది. తెచ్చిన సొమ్మంతా కూరగాయలకే సరిపోవడంతో కనీసం ఆటోకు వెళ్లడానికి సైతం డబ్బులు లేని పరిస్థితి ఏర్పడింది. అసలే అంతంతమాత్రపు ఆదాయాలతో జీవితాలు నెట్టుకొస్తున్న సామాన్యులు.. చుక్కలనంటుతున్న ధరలతో జీవించేదెలా అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వరలక్ష్మి ఎదుర్కొన్న పరిస్థితే నేడు అన్నిచోట్లా కనిపిస్తోంది. అదే కొంచెం పెద్ద కుటుంబం అయితే ఎంత ఖర్చు అవుతుందో ఊహించుకోవచ్చు.



కూరగాయల ధరలు సామాన్యుడి గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. వరదలతో అతలాకుతలమైన గాయాల నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ప్రజలను ఉల్లిపాయలు, నిత్యావసర వస్తువుల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. వంటలో ప్రాథమికంగా వినియోగించే టమాటా, ఉల్లి ధరలు అందనంత ఎత్తుకు చేరడంతో తాము బతికేదెలా అని పేదలు వాపోతున్నారు.

కైకలూరు: మార్కెట్‌లో కూరగాయలు కొనాలన్నా, వంట చేసుకుని తినాలన్నా వీలుకాని పరిస్థితుల్లో జనం పచ్చడి మెతుకులు, చారన్నంతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. టమాటా ధర చూస్తే గత నెల మొదట్లో కేజీ రూ.34 ఉండగా ఇటీవల రూ.46కు పెరిగింది. ప్రస్తుతం రూ.60కి పైనే విక్రయిస్తున్నారు. నిత్యం ఉపయోగించే ఉల్లిపాయల ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. రెండు నెలల క్రితం కేజీ రూ.40 ఉండగా వారం కిందట రూ.58కి చేరింది. ఇప్పుడు ఏకంగా రూ.70 నుంచి రూ.80కి పాకింది. చిక్కుళ్లు అయితే రకాన్ని బట్టి కేజీ రూ.100కి అమ్ముతున్నారు. ఇక వంకాయల ధర గతంలో కేజీ రూ.30 ఉండగా ఇప్పుడు రూ.60కి చేరింది. కాకరకాయ, బీరకాయ, దొండకాయ, బంగాళా దుంప, చామదుంప, బీట్‌రూట్ వంటివి కేజీ రూ.60కి విక్రయిస్తున్నారు. ఇవి గతంలో రూ.40 లోపు లభించేవి. ఇక అల్లం విషయానికి వస్తే గతంలో కేజీ రూ.120కి విక్రయించగా ఇప్పుడు రూ.200కి చేరింది. ఇవే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలు సైతం అమాంతం పెరిగాయి.

ఆకు కూరల ధరలకూ రెక్కలు

ఆకు కూరల ధరలకు సైతం రెక్కలు వచ్చాయి. వర్షాలకు పంటలు దెబ్బతినడంతో ధరలు పెరిగాయి. వరదలకు ముందు తోటకూర మూడు కట్టలు ఒక్కో కట్ట రూ.10 చొప్పున రూ.30 తీసుకునేవారు. ఇప్పుడు అవే మూడు కట్టలను రూ.60కి విక్రయిస్తున్నారు. బచ్చల కూర, గోంగూర, పాలకూర, చుక్కకూర, మెంతికూర, కొండపిండి ఆకు, పటమటి కూర, మునగాకు వంటివి సైతం కట్టకు రూ.10 చొప్పున పెరిగాయి.

పెరిగిన ధరలతో ఆర్థిక భారం



కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. దీంతో మధ్యతరగతి వారికి ఇబ్బందికరంగా మారింది. ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నాం. రోజురోజుకూ పెరుగుతున్న కూరల ధరలను వెంటనే ప్రభుత్వం నియంత్రించాల్సిన అవసరం ఉంది.

– ఎ.రవికుమార్, మండవల్లి

ధరలు అమాంతం పెరిగాయి



ఒకే నెలలో నూనెలు, ఉల్లిపాయలు, కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోవడం గతంలో ఎన్నడూ చూడలేదు. మాలాంటి పేదవాళ్లం బతికేందుకు ప్రభుత్వాలు ఏమాత్రం అవకాశం కల్పించడం లేదు. నిత్యావసరాల ధరలు ఇదేవిధంగా పెరుగుతూ పోతే సామాన్యుల గతి ఏంకావాలి? ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– కరీం బాషా, అల్లినగరం

పేదలు బతికేదెలా?



రోజురోజుకూ నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు పెరిగిపోతుంటే మాలాంటి సామాన్యులం ఎలా బతకాలి. రోజువారీ కూలి పనులు చేస్తేనే బతికే మాలాంటి వాళ్లకు పెరుగుతున్న ధరలతో బతుకీడ్చడం కష్టంగా మారింది. పెరుగుతున్న ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– నీలకంఠి సత్యవతి, గృహిణి, లింగాల

సామాన్యులపై రోకటి పోటు



అసలే అంతంతమాత్రపు ఆదాయంతో జీవితాలు నెట్టుకొస్తున్న సామాన్యులకు కూరగాయల ధరలు రోకటి పోటు మాదిరిగా మారాయి. కుటుంబంలో నలుగురు తినాలంటే కూరగాయలకు ఎక్కువ సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తోంది. గతంలో కంటే రెండు, మూడు రెట్లు పెరగడంతో సామాన్యులకు ఇబ్బందికరంగా మారింది.

– కోగ భవాని, గృహిణి, మండవల్లి

రాష్ట్రంలో దమన కాండకు కారకుడు చంద్రబాబే

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి

పామర్రు: రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుత ప్రభుత్వ దమన కాండ, హత్యాకాండలకు సీఎం చంద్రబాబే ప్రధాన కారకుడని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ మానవత తప్పిదం కారణంగా వరదలకు 40 మంది ప్రాణాలను పోగొట్టుకున్నారన్నారు. దీనికి కూటమి ప్రభుత్వం కారణం కాదా అని ప్రశ్నించారు. వెలగనేరు గేట్లు మూసి వేసిన కారణంగా చంద్రబాబు నివాసం వరద ముంపునకు గురైయిందని, వెంటనే గేట్లను ఒక్కసారిగా ఎత్తి వేయడంతోనే వరద ముంపు సమస్య వచ్చిందన్నారు. గతంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో వైఎస్సార్ సీపీ పాలనలో బుడమేరును మూడు పాయలుగా చేసి ఒకటి కృష్ణానదిలోకి, ఇంకొకటి వీటీపీఎస్‌లోకి, మరొకటి బుడమేరులోకి వెళ్లేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. వరద బాధితులు లక్షలాది మందికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోతున్నామని అధికారులు, చంద్రబాబు కూడా తెలిపారని ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. దీనిని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు తిరుమల లడ్డూ ప్రసాదంపై రాజకీయాన్ని తీసుకొచ్చారన్నారు. ఇది వికటించడంతో డిక్లరేషన్ అంశాన్ని తీసుకొచ్చారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలకు వెళ్లాలంటే డిక్లరేషన్ ఇవ్వాలని డిమాండ్‌కు దిగారన్నారు. ఇది చాలా దారుణం అన్నారు. కులమతాలు, దేవుడి పేరుతో నానా యాగీ చేయటం మంచి పద్ధతి కాదన్నారు. 100 రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. రానున్న రెండేళ్లలో జమిలీ ఎన్నికలు రానున్నాయని తస్మాత్ జాగ్రత్త అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ వరదల సమయంలో యలమలకుదురు నుంచి అవనిగడ్డ వరకు ఉన్న లంక గ్రామాల్లోని రైతులు తమ వాణిజ్య పంటలకు ఒక్కొక్క ఎకరానికి రూ.2.50 లక్షల పెట్టుబడి పెట్టారన్నారు. ప్రభుత్వం మాత్రం నష్ట పరిహారంగా రూ.3 వేలు లేక రూ.5 వేలు మాత్రమే ఇవ్వడం దారుణం అన్నారు. రైతులకు విత్తనాలను 90 శాతం సబ్సిడీపై అందించాలన్నారు. త్వరలో జరగబోయే ఎంఎల్‌సీ ఎన్నికల్లో గతంలో ఫైబర్‌నెట్ చైర్మన్‌గా పని చేసిన గౌతమ్‌రెడ్డిని కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల అభ్యర్థిగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. రానున్న ఎంఎల్‌సీ ఎన్నికల్లో గౌతమ్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌతమ్‌రెడ్డి, పక్కన అనిల్‌కుమార్

విజ్ఞానం పెంచుకుంటే భవిష్యత్‌కు పునాది

వ్యోమగామి కెప్టెన్ గోపిచంద్ తోటకూర

వానపాముల(పెదపారుపూడి): చిన్నతనం నుంచే విద్యార్థులు పలు అంశాలపై విజ్ఞానం పెంచుకుంటే భవిష్యత్ జీవితానికి పునాదిగా మారుతుందని భారత దేశపు రెండో వ్యోమగామి కెప్టెన్ గోపిచంద్ తోటకూర అన్నారు. మండలంలోని వానపాముల గ్రామంలో ఉన్న విశ్వభారతి వైజ్‌వుడ్స్ పాఠశాల్లో ఆదివారం ప్రముఖులతో భవిష్యత్ ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిచంద్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలన చేయలన్నారు. విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడి అవగాహన కల్పించారు. ఆర్.టి గురు ఆఫ్ ఇండియా కెప్టెన్ రవీందర్, విస్తా జెట్ ఎయిర్‌లైన్స్ ప్రధాన ఆధికారి రిచర్డ్, విస్తాజెట్ ఎయిర్‌లైన్స్ ప్రధాన సిబ్బంది రెనీ, తదితరులు విద్యార్థులకు ప్రేరణ భవిష్యత్ జీవితానికి దిశానిర్దేశం చేశారు. తొలుత అతిథులకు వైజ్‌వుడ్స్ డైరెక్టర్ మంజుల స్వాగతం పలికారు. కార్యక్రమంలో విశ్వ భారతి సంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్లు ఆర్.మంజుల, ప్రణీత్, ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.



రెండో వ్యోమగామి గోపిచంద్‌కు షీల్డ్‌ను అందజేస్తున్న వైజ్‌వుడ్స్ డైరెక్టర్ మంజుల

అంకితభావంతో పనిచేస్తే గౌరవం

కైకలూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే అన్నిచోట్లా గౌరవింపబడతారని కై కలూరు రూరల్ సర్కిల్, టౌన్ సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ అన్నారు. హోంగార్డుగా పనిచేసి పెట్రోల్ కమాండర్‌గా ఉద్యోగ విరమణ చేసిన కొల్లా రాజారావు ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం ఆదివారం స్థానిక కార్తికేయ మినీ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఏలూరు జిల్లా హోంగార్డు ఇన్‌చార్జి ఆర్ఐ పి.పవన్‌కుమార్, టౌన్, రూరల్ ఎస్ఐలు ఆర్.శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.



రాజారావు దంపతులను సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: మండలంలోని అగినపర్రు, మామిళ్లపల్లి, బొడ్డువానిగూడెం, తెల్లాకులపాలెం గ్రామాల్లో సోమవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ బ్యాగులు నిషేధించకపోతే నిరవధిక దీక్ష



సేవా సంస్థ వ్యవస్థాపకుడు పవన్ కాంత్

కైకలూరు: పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని, లేదంటే నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని కై కలూరు స్విప్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, న్యాయవాది పిచ్చికల పవన్‌కాంత్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ బ్యాగులను వాడకూడదని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించిందని తెలిపారు. గ్రామ స్థాయిలో పంచాయతీ అధికారులకు తనిఖీలు, జరిమానా విధించే అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. అయినా అధికారులు క్యారీ బ్యాగుల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అక్టోబర్ రెండో తేదీ నాటికి మండలంలో వీటి వాడకాన్ని నిరోధించాలని ఆయన డిమాండ్ చేశారు.

సమాజ సేవకే స్వచ్ఛంద సంస్థ

గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సమాజ సేవకు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ కృష్ణా జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. ఆదివారం సేవాసంస్థ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుండె వ్యాధితో బాధపడుతున్న డి.సరళవేణికి సంస్థ రూ. 5 వేలు అందజేశారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ వి. నవీన్ కుమార్ సేవలకు గాను ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, సీనియర్ జర్నలిస్ట్ బండారు రాధాకృష్ణ, దండమూడి సీతారామస్వామి, నందమూరి పద్మజ, పి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఏ విద్యార్థినికి ఆర్థిక సాయం

మండవల్లి: పేదరికం వల్ల సీఏ చదువుకు ఫీజు చెల్లించేందుకు ఇబ్బందిపడుతున్న విద్యార్థినికి మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన సీఏ విద్యార్థిని మండపాటి లక్ష్మీశరణ్యకు రూ.1.75 లక్షలు ఆర్థిక సాయం అందించినట్టు ఆ సంస్థ మండల అధ్యక్షుడు గుడివాడ గణేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. బొమ్మలూరుకు చెందిన నెక్స్‌జెన్ సంస్థ ఎండీ అడుసుమిల్లి వెంకటసుబ్రహ్మణ్యం ఆన్‌లైన్ ద్వారా ఈ సొమ్మును గుంటూరు కళాశాలకు జమ చేసినట్లు పేర్కొన్నారు. సహకారం అందించిన విద్యాదాతకు రాష్ట్ర శాఖ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్ : ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. స్వామి వారి పుట్టలో పాలు పోసేందుకు, పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులు స్వామిని దర్శించుకున్న అనంతరం నాగబంధాల వద్ద పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

గుడ్లవల్లేరు విద్యార్థులకు ప్రథమ బహుమతి

గుడ్లవల్లేరు: జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌లో 2024కు సంబంధించి గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించి విజయ ఢంకా మోగించారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ ఆదివారం విలేకరులకు తెలిపారు. గుంటూరు కల్లం హరనాథరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారు ఈ నెల 27న జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ సంకల్ప–2024ను ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్థులకు కలిపి నిర్వహించారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో తమ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ చదువుతున్న ఏవీఎస్ అక్షయ్, ఎ.కృష్ణతేజ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ పవర్ జనరేషన్ యూజింగ్ రేనేవల్బుల్ సోర్సెస్ అనే అంశంపై ఇంజినీరింగ్ విద్యార్థులతో తలపడి ప్రథమ బహుమతిని కై వసం చేసుకున్నారని తెలిపారు. విజేతలతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన మెకానికల్, ఈసీఈ విభాగాధిపతి, అధ్యాపకులను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు అభినందించారు.



విజేతలతో ప్రిన్సిపాల్ రాజశేఖర్, మెంటార్ రామాంజనేయులు

శ్రీసత్యసాయి పర్తియాత్ర విజయవంతం చేయాలి

పెనమలూరు: శ్రీసత్యసాయి పర్తియాత్రను విజయవంతం చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. పెనమలూరు శ్రీ సత్యసాయి సేవా సమితిలో ఆదివారం పర్తియాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. డిసెంబరులో 14, 15, 16 తేదీల్లో పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో యాత్ర సాగుతుందని, కృష్ణాజిల్లా పర్తియాత్రను దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసిన విద్యార్థులకు వేదం, భజనలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి పర్తియాత్రకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్తలు డి.మోహన్‌రావు, వి. లక్ష్మీప్రసూన, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్తలు ఎ.మురళీకృష్ణ, డి.సాయిజ్యోతి, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న చిన్నారులు

క్లుప్తంగా

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో పాల పొంగళ్లను పొంగించి మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం ఆదివారం వేలాది సంఖ్యలో భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తగు ఏర్పాట్లు చేశారు.

భారీ అన్నసమారాధన



గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద వేంచేసియున్న శ్రీ సిద్ధ లక్ష్మీ గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శాంతి నిమిత్తం ఈ అన్నసమారాధన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. 25 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జవ్వాజి ప్రసాదు, మాజేటి శ్రీనివాస్, పేరూరి సుబ్రహ్మణ్యం, కొల్లిపర సాయి సుబ్రహ్మణ్యం, సముద్రాల జగ్గారావు, వెంకన్నబాబు, సూర్యనారాయణ, ఆలయ అర్చకులు రామ్మోహనరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



ముదినేపల్లి రూరల్: మండలంలోని దాకరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అర్జా కమలరాజు ఆదివారం మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కమలరాజు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కమలరాజు కుటుంబ సభ్యులు జి.సామియేలు తదితరులను పరామర్శించి సానుభూతి తెలిపారు. నివాళులర్పించినవారిలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు గుజ్జుల వినయ్‌కుమార్, కూరెళ్ల నరేష్ తదితరులు ఉన్నారు.


దంపతులపై దాడి.. నిందితులపై కేసు

ముదినేపల్లి రూరల్: భార్యాభర్తలపై దాడి ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని పెదకొమర్రుకు చెందిన వేములవాడ నాగరాజు భార్య మార్తమ్మ కోళ్లకు మేత వేస్తుండగా సరిహద్దున ఉన్న శ్రీదేవి, గన్ని నరస, మరో ఐదుగురు వ్యక్తులు మార్తమ్మపై దాడి చేశారు. దీనిని అడ్డుకోబోయిన ఆమె భర్త నాగరాజుపై సైతం పలుగు, కర్రతో దాడి చేయగా గాయాలపాలై గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అక్టోబర్ మూడో తేదీ నుంచి 13 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.దివ్యశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ సాయంత్రం అఖండ అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

వేల్పూరు వంతెనకు మోక్షమెప్పుడో..?



పమిడిముక్కల: కనుమూరు–ముళ్లపూడి రహదారిపై వేల్పూరు గ్రామం మొదట్లో డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన వద్ద రోడ్డు సగం వరకు కోతకు గురైంది. దీంతో వంతెనపై నుంచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హనుమంతపురం, ముళ్లపూడి, ఐనంపూడి గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదకరంగా ఉన్న వంతెన ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల అధికారులు వంతెనను పరిశీలించి వెళ్లారని, అప్రోచ్ రోడ్డు వేసి, కొత్త వంతెన ఏర్పాటు చేస్తామని తెలిపారని, ఇంతవరకు చర్యలు తీసుకోలేదని స్థానికులు తెలిపారు. వేల్పూరు వంతెనకు మోక్షం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

దైవం ముందు ప్రజలందరూ సమానం



పామర్రు: దైవం ముందు ప్రజలందరూ సమానమని జమీఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రఫీక్ అన్నారు. స్థానిక గఫార్ సెంటర్‌లో ప్రవక్త జన్మదిన మాసం సందర్భంగా అబ్దుల్లాహ్ ఉమరీ అధ్యక్షతన ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పుట్టుక రీత్యా ఎవరూ అధికులు, అల్పులు కారన్నారు. ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం పలువిద్యా సంస్థల్లో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సింగంశివయ్య, పులి కేశవబాబు, నాగినేని శ్యాముల్, బేతనభొట్ల సుబ్బారావు, ముస్తఫీం, ఆరిఫ్, షుజజ్, ముస్తఫా, అబ్దుల్ ఖాలిక్ పాల్గొన్నారు.

పీఎంఎస్ ప్రసాద్‌కు జాషువా స్మారక అవార్డు



పామర్రు: కవి గుర్రం జాషువ జయంతిని పురస్కరించుకుని ఆయన స్మారక సాహిత్య సేవా అవార్డును ఆదివారం పామర్రుకు చెందిన పీఎంఎస్ ప్రసాద్‌కు అందజేశారు. విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయం ఆడిటోరియంలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాషువా జయంతి వేడుకల్లో ఈ అవార్డును అందజేశారు. 'కాకుల యుగంలో కవి కోకిల రాగాలు' అనే పరిశోధన వ్యాసం రాసిన పీఎంఎస్ ప్రసాద్‌కు అంతర్జాతీయ సేవాసంస్థ చైర్మన్ డాక్టర్ పీ యోహాను అవార్డును ఇచ్చి సత్కరించారు. అవార్డు అందుకున్న ప్రసాద్‌ను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకయ్య, మానవత సంస్థ ప్రెసిడెంట్ వెంకటనారాయణ, కళా పరిషత్ అధ్యక్షుడు త్రివిక్రమరావు తదితరులు అభినందించారు.

రేపు సర్వసభ్య సమావేశం

గుడివాడ టౌన్: కృష్ణా జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అక్టోబర్ ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చిన్నం గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక ఏజీకే హైస్కూల్ ఆవరణలో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలిపారు. సభ్యులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా గోపూజ

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం గోపూజ ఘనంగా నిర్వహించారు. గోవు ఘోష విను గోవిందా పేరుతో బీజేపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బీజేపీ రాష్ట్ర నాయకులు మట్టా ప్రసాదు, ప్రణవాశ్రమ పీఠాధిపతి స్థైర్యానంద సరస్వతి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ID కార్డ్ పోయినది

కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, డోర్ నెం. 7/38, బిళ్లపాడు గ్రామ వాస్తవ్యులు పెద్దింటి రవీంద్రరావు, S/o. పెద్దింటి రామస్వామి అను నేను మాజీ సైనిక ఉద్యోగిని. నా పేరు మీద ఉన్న జిల్లా గ్రామీణ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణాజిల్లా వారి నుండి పొందిన ఐ.డి. కార్డు 6168104, నెం. ఏ.పి. 05/00958 ఐ.డి. కార్డును బిళ్లపాడులోని నా ఇంటి నుండి పెదకాలువ సెంటర్‌కు ఆటోలో వెళుతుండగా మార్గం మధ్యలో ఐ.డి కార్డు కలిగిన కవరు పోయినది. ఎంత వెతికిననూ దొరకలేదు.ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది సెల్ నెంబర్‌కు తెలియజేయగలరు.
పెద్దింటి రవీంద్రరావు, సెల్ : 94412 46690